# నేడే బాలల దినం

—కోనేరు రాజబాబు

## ఆ రోజు నవంబరు 14.
## బాలల దినం.

ఊరు ఊరంతా ఉదయం నుంచీ మైకుల శబ్దాలతో హోరెత్తుతోంది. ఏ మూల చూసినా పాత సినిమాలలోని బాలల మీద వచ్చిన పాటలు వినిపిస్తున్నాయి. ఏ పాఠశాలలో చూసినా రంగు రంగుల తోరణాలు దర్శనమిస్తున్నాయి. ఏ ఇంట చూసినా ముచ్చట గొలిపేబట్టలతో పిల్లలు ముస్తాబవుతున్నారు.

టోపీలు ధరించిన నాయకులు పిల్లలకు మిఠాయిలు పంచి పేపర్లో ఫోటోలు వేయించుకునేందుకు హుందాగా తయారవుతున్నారు.

ఆ మైకు శబ్దాలు వినపడకనో, రాత్రి మత్తు వదలకనో ఆ ఇంటి యజమాని బాలయోగి గారు ఇంకా నిద్ర మంచాన్ని వదలకుండా వేళ్ళాడుతున్నారు—బాలయోగి గారంటే ఆయన బాలుడు కాదు— యోగి అంతకన్నా కాదు—వాళ్ళ అమ్మగారు ఒకసారి ముమ్మడివరం వెళ్ళి తన బిడ్డకు ముద్దుగా పెట్టుకున్న పేరది.

"ఊరంతా మైకులతో హోరెత్తిపోతుంటే మీరు నిద్ర లేవరేమిటండీ" అంటూ భర్తను నిద్ర లేపటానికి ప్రయత్నిస్తోంది బాలయోగి గారి భార్యామణి మంగతాయారు—

"ఏమిటె తాయారూ? పనిలేని రోజున కూడ కాసేపు పండుకోనివ్వవు" అంటూ భార్య మీద కస్సుబుస్సు లాడనారంభించారు బాలయోగిగారు—ఇంకా రాత్రి మత్తు దిగలేదాయునకు—

"అయినా చెవులు చిల్లులు పడేలా అంతంత శబ్దాలు వస్తుంటే మైకుల నుంచి మీకు ఎలా నిద్ర పడుతోందండీ?" అంటూ తెచ్చిన కాఫీ టీపాయ్ మీద పెట్టింది మంగతాయారు.

"మైకులేమిటి?" అడిగారు బాలయోగిగారు మైకం నుంచి తేరుకుంటూ—

"అయ్యో రామ? ఈ రోజు బాలల దినం కదండీ—ప్రజా నాయకులు ఆమాత్రం గుర్తుపట్టలేదా?"

అంటూ బుంగమూతి పెట్టి వెళ్ళిపోయింది తాయారు.

ఆ మాటలు విన్న బాలయోగిగారికి మైకం పూర్తిగా దిగిపోయింది—అమాంతం లేచి కూర్చున్నారు.

"మన పెళ్ళయిన యిన్ని సంవత్సరాలకు ఒక్క మంచి పని చేశావు అమ్మే! ఈ రోజు హైస్కూలులో బాలల దినం ఘనంగా జరుపుతున్నారు—కలెక్టరుగారు అధ్యక్షులు.

నేను ముఖ్య ఉపన్యాసకుడిని—నిజంగా నువ్వు నిద్ర లేపకుండా ఉంటే నిద్ర లేచేవాడినే కాదు" అంటూ భార్య యిచ్చిన కాఫీ అందుకున్నారు.

"మీరక్కడ ఏం మాట్లాడతారండీ?" గారంపోతూ భర్త తల వెంట్రుకలను సరిచేస్తూ అడిగింది తాయారు.

"అదేమిటే పిచ్చిమొహమా? ఈరోజు బాలల దినం కదా? బాలల గురించి ఉపన్యాసం దంచేస్తాను. పెద్ద పెద్ద వాళ్ళంతా వస్తారు—చాలా కలర్‌ఫుల్‌గా వుంటుందిలే—నువ్వు కూడ రా—ఆ దండలూ—ఆ వైభోగం నువ్వు చూసి తీరాలి" అన్నారు బాలయోగిగారు—

'అలాగా!' అంటూ నోరు తెరిచింది తాయారు—చకచకా రెండు నిమిషాలలో పళ్ళు తోముకొని బయట పడ్డారు బాలయోగిగారు—

"ఏమండీ, ఏమండీ! అంత దూరం నేను రాలేను కాని రెండు ముక్కలు చెప్పండి వింటాను" అంటూ ప్రేక్షకురాలిలా అతని ముందు కుర్చీలో కూర్చుంది తాయారు.

"నాకు నా ప్రజలు అంటే జనం ఎదురుగా వుంటే కాని నాకు మూడ్ రాదు—అయినా నా ప్రియమైన భార్యవు అడుగుతున్నావు కాబట్టి చెబుతాను.

వేదిక నలంకరించిన పెద్దలారా? వేదిక ముందున్న భావి భారత పౌరులారా? ఈ రోజెంతో సుదినం—బాలల దినం—నేటి బాలలే రేపటి పౌరులు"

"ఏమండీ! అక్కడి నుంచే నేను చెబుతానండీ" అంటూ మంగతాయారు ఉపన్యాస ధోరణిలో మొదలు పెట్టింది.

"ఈ దేశానికి వారసులు ఈ జాతికి రత్నాలు—ఎందరో త్యాగ మూర్తులు ఉద్భవించిన ఈ పుణ్య భూమిపై జన్మించటం నిజంగా గర్వ కారణం—అలాంటి త్యాగ మూర్తులు ఎన్నో త్యాగాలు చేసి లాఠీ దెబ్బలు తిని రక్తాన్ని చిందించి తుదకు తమ ప్రాణాలను కూడ అర్పించి మనకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టారు."

బాలయోగిగారు ఊహించని ఆమె ఉపన్యాసానికి ఆశ్చర్యపోయారు—అలా తన భార్య మాట్లాడగలదని ఏనాడూ ఊహించలేదాయన—క్షణంలో తేరుకొని లేని నవ్వు తెచ్చుకుంటూ "అదేమిటే? నేను చెబుదామనుకొన్నది కరెక్టుగా నువ్వే చెప్పేశావు—ఎలా ఊహించావు?" అడిగారు బాలయోగిగారు.

"ఉదయం పచారీ కొట్టు నుంచి శనగ పప్పు రెండు కిలోలు తెప్పించానండీ—దానికి చుట్టిన పేపరు రంగు రంగు డిజైనులతో వుంటే



ఏమిటా అని చూశాను. తీరా చూస్తే అది పాతికే సంవత్సరాలనాడు బాలల దినం పేపరండీ—ఆ రోజు నాయకులు కూడ అచ్చు మీలాగానే మాట్లాడారండీ—అదే నేను చెప్పాను" అంది తాయారు. మళ్ళీ తనే అందుకొంటూ ఏమండీ! నేను మిమ్మల్ని ఒక్క ప్రశ్న అడుగుతాను—సూటిగా సమాధానం చెప్పండి—ఇన్ని సంవత్సరాల మన సంసార జీవితంలో ఎప్పుడైనా మన పిల్లల గురించి ఆలోచించారా? వాళ్ళ చదువుల గురించి పట్టించుకున్నారా? ఎంతసేపూ మీ ఉపన్యాసాలూ, దండలూ తప్పించి చెప్పండీ" అంటూ భర్తను నిలదీసింది తాయారు.

బాలయోగి గారికి నోట మాట రాలేదు.

"అదీ అదీ మన గాంధీ మహాత్ముడు ఏం చెప్పాడంటే తాయారూ"

"ఏమండీ! అనవసరంగా పెద్ద వాళ్ళ పేర్లుచెప్పుకుంటూ మీరు ఆచరించనివి ఎదుటి వారికి బోధించాలనుకొంటున్నారు. నిజానికి గాంధీ నుంచి మీరు ఆదర్శంగా తీసుకున్నది ఆయన ఆదర్శాలు కాదు—ఆయన టోపీనే—"

దీనికి మౌనమే ఆయన సమాధానమైంది.

ఇవేమీ తనకు పట్టనట్టు బయటకు వెళ్ళేందుకు ప్రయాణ మౌతున్నారు.

ఖద్దరు బట్టలు వేశారు—పౌడరు రాసి, స్ప్రే కొట్టుకున్నారు—

"తాయారూ! నా పెన్నెక్కడ?" అంటూ భార్యను పిలిచారు.

"నాకేం తెలుసండీ—ఎక్కడ పెట్టుకున్నారో—ఏమో" అంటూ సమాధాన మిచ్చింది తాయారు—బాలయోగి గారు ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా

"మన రామం ఏడీ?" అని అడిగారు.

"బయట కూర్చొని చదువుకుంటున్నాడండీ" అని సమాధాన మిచ్చింది.

వెంటనే బాలయోగిగారు బయటకువచ్చి "ఒరేయ్ రామం! నిన్న పరీక్ష రాయడానికి నా పెన్ను తీసుకున్నావు ఏదీ?" అడిగారు —

"నిన్న మధ్యాహ్నం మీకు తిరిగి ఇచ్చేశాను నాన్నగారూ!" అంటూ పదేళ్ళ రామం సమాధానమిచ్చాడు.

"వెధవా! అబద్దాలు కూడా నేర్చుకున్నావా! నాకెప్పుడిచ్చావ్ — అక్కడికీ ఇది చాలా విలువైన పెన్నురా అని చెప్పాను — చెప్పానా లేదా?" పెద్దగా అరిచారు బాలయోగిగారు.

"చెప్పారు నాన్నగారూ! పరీక్ష నుంచి రాగానే మీకు ఇచ్చేశాను" వణుకుతూ సమాధానమిచ్చాడు ఆ పసికందు. ఆ అబ్బాయి చెప్పిన సమాధానానికి ఒళ్ళు మండింది బాలయోగిగారికి.

అంతే!

మరుక్షణంలో కుర్రవాడి చెంప ఛెళ్ళుమంది — "నిజమే నాన్నగారూ?" అంటూ కుర్రవాడు వణికిపోతున్నాడు.

"నిక్షేపం లాంటి పెన్ను ఎక్కడో పారవేసింది కాక ఇంకా అబద్దాలు కూడానా?" అంటూ మరో చెంప ఛెళ్ళు మనిపించారు బాలయోగిగారు.

ఆ దెబ్బకు కుర్రవాడు 'అమ్మా' అంటూ కిందపడ్డాడు. ఇది విన్న మంగతాయారు ఇంట్లో నుంచి ఒక్క అడుగులో బయటకువచ్చింది. కుర్రవాడు కిందపడి ఒణికి పోతున్నాడు — వెంటనే ఇంట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి కుర్రవాడికిచ్చింది — మొఖాన కాసిని నీళ్ళు చిమ్మింది — కాసేపటికి కుర్రవాడు తేరుకున్నాడు. "పసికందును అలా గొడ్డులా కొట్టడానికి మీకు చేతులెలా వచ్చాయి? పైగా ఉపన్యాసాలివ్వడానికి బయలుదేరారు" అంటూ పరోక్షంగా భర్తను చివాట్లు పెట్టింది తాయారు.

"తాయారూ! అనవసరంగా పిల్లలను గారం పెట్టి చెడగొడుతున్నావు — వాడు అబద్దాలు ఆడడానికి కూడా వెనుకాడడం లేదు. వాడిని అలా పెంచితే వాడి భవిష్యత్తేమౌతుందో ఆలోచించావా?" గుడ్లెర్ర జేసి అన్నారు బాలయోగిగారు.

"ఎక్కడో అడుక్కుతిని బతుకుతాడు. మీరు మాత్రం వాడిని పశువులా కొట్టి చంపకండి. వాడు తప్పుచేస్తే చేతనైతే తండ్రిగా మంచి మార్గాన పెట్టండి. లేకపోతే వాడి ఖర్మకు వాణ్ణి వదిలేయండి" అంటూ భోరున ఏడ్చింది తాయారు.

ఆ పసికందు తల్లి ఏడ్వడం చూడలేక లేచి కూర్చుంటూ, "అమ్మా! నువ్వు ఏడ్వకమ్మా — నిజంగా నాన్నగారి పెన్ను తిరిగి ఇచ్చేశానమ్మా" అన్నాడు.

"చూశావా! నువ్వు వాడికి వత్తాసు పలకబట్టే మళ్ళీ అదే కూత కూస్తున్నాడు" అన్నాడు బాలయోగి.

"వాడు సామాన్యంగా అబద్దం ఎప్పుడూ చెప్పడండీ!" గద్గద స్వరంతో అంది తాయారు.

"అంటే నీ ఉద్దేశ్యం? నేను అబద్దం చెబుతున్నాననా?" విరుచుకుపడ్డారు భార్య మీద బాలయోగిగారు.

ఈలోపు తలుపు చప్పుడయింది.

తాయారు వెళ్ళి తలుపు తీసింది.

"బాలయోగిగారి ఇల్లు ఇదేనాండీ?"

"అవును. ఇదే! నీకేం కావాలి?" దురుసుగానే బదులిచ్చారు బాలయోగిగారు ముందుకు వచ్చి.

"నమస్కారం సార్! నేను స్టేట్ బ్యాంక్‌లో ప్యూనునండీ. నిన్న మధ్యాహ్నం మీరు బ్యాంకుకు వచ్చినప్పుడు ఈ పెన్ను అక్కడ వదిలేసి వచ్చారు. మేనేజరుగారి దగ్గర అడ్రసు తీసుకొని మీకు ఇద్దామని వచ్చాను. ఇదిగోండి సార్ పెన్ను..." అంటూ బాలయోగి చేతిలో పెన్ను వుంచాడు.

అది చూసేసరికి ఆ పసికందు మొఖంలో వెయ్యి దివిటీల కాంతి కనుపించింది. మంగతాయారు ఒక్కసారి భర్త వంక చీదరింపుగా, అసహ్యంగా చూసింది. చేతిలో పెన్నుతో శిలావిగ్రహంలా నిలబడిపోయారు బాలయోగిగారు.

అతని చేతిలోని పెన్ను తన కథను గుర్తు చేస్తోంది.

ఒకసారి బాలయోగిగారు మద్రాసు నుంచి రైలులో స్లీపర్ కోచ్‌లో వస్తుంటే తన పై బర్తులో పండుకున్న వ్యక్తి పెన్ను కిందపడిపోయింది.

బాలయోగిగారు అది గమనించారు.

పై బర్తులో వున్న వ్యక్తి గాఢ నిద్రలో వున్నాడు.

బాలయోగిగారు నిదానంగా ఆ పెన్ను తీసి చూశారు.

అందంగా ఖరీదైనదిగా కనుపించింది.

ఎందుకో అది తిరిగి ఇవ్వడానికి బాలయోగిగారికి మనస్కరించలేదు.

వెంటనే దాన్ని జాతీయంచేసి పెట్లో భద్రపరిచారు.

బాలయోగిగారికిప్పుడు చేతులు వణుకుతున్నాయ్.

పరుల సొమ్ము దొంగిలించి తాను సమాజంలో నీతులు వల్లిస్తూ పెద్ద మనిషిగా చెలామణీ అవుతున్నాడు.

కానీ అతి సామాన్యుడైన ప్యూను ఎంతో శ్రమించి తనను వెతుక్కుంటూ వచ్చి దానిని తనకు అందజేశాడు.

అతని నిజాయితీ తనను శూలాలతో పొడుస్తోంది.

కానీ! అమాయకుడైన కుర్రవాడిని అబద్దం చెప్పాడంటూ అమానుషంగా కొట్టినందుకు నిలువెల్లా చెమటలు పడుతున్నాయ్ — అమ్మ తనకు పెట్టిన పేరు ఇప్పుడు తనను వెక్కిరిస్తోంది.

అవమానం క్రుంగదీయగా, తన రాక్షసత్వం తనను హేళన చేయగా, కాళ్ళు తడబడుతూ క్రిందకు కూలబడ్డాడు బాలయోగిగారు.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్